ఎన్నాళ్లీ అవస్థలు


రోటరీపురం కొత్త కాలనీలో మ్యాన్‌హోల్ నుంచి పొంగి పొర్లుతున్న మురుగునీరు

- ఇంటి ముందర మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న కాలనీ ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని రోటరీపురం కొత్త కాలనీ సమీపంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డులోని యూజీడీ నుంచి మురుగునీరు నిండి పొంగి పొర్లుతోంది. గత నెల రోజులుగా ఈ ఇబ్బందులు పడుతూనే ఉన్నామని, ఈ విషయమై మున్సిపల్ అధికారులకు చెప్పినా కూడా వారు రోడ్డు కాంట్రాక్టర్‌కు సంబంధమని చెబుతున్నారని, కాంట్రాక్టర్ మాత్రం రోడ్డు వేయడంతో మా పని అయిపోయిందని, మీ సమస్య మున్సిపాలిటీ వాళ్లే చూసుకోవాలని చెబుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. తమ సమస్య గురించి మున్సిపల్ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతిరోజు ఇంటి ముందర మ్యాన్ హోల్ పొంగి పొర్లుతూ దుర్గంధం వెదజల్లుతోందని, వాసన భరించలేకున్నామని, ఇంటిలో నుండి బయటకు రావాలంటేనే మురుగు తొక్కుకొని రావాల్సిందేనని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీరు పొంగి పొర్లి ఇంటి చుట్టూ మురుగుమయంగా మారింది. దీంతో ఆప్రాంతమంతా దోమలతో అల్లాడిపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగును శుభ్రం చేయించి మ్యాన్ హోళ్లను శుభ్రం చేయించి పూడికలు తీయించి మురుగునీరు పొంగి ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.


ఇంటి ముందర మ్యాన్‌హోల్ నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం



గత నెల రోజులు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా ఇంటి ముందర ఉన్న మ్యాన్‌హోల్‌లో మురుగునీరు పొంగి ప్రవహిస్తున్నాయి. నిత్యం ఇంటి ముందర ఉన్న మురుగునీటితో అవస్థలు పడుతున్నాం. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఇంటి ముందర మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలి.

– అన్నపూర్ణమ్మ, స్థానికురాలు, రోటరీపురం, పులివెందుల

అధికారులు స్పందించాలి



ఇంటి ముందర మురుగునీరు ప్రవహిస్తోంది. ఎన్నాళ్లు ఈ అవస్థలు పడాలి. ఇంటిలో వికలాంగులు, వృద్ధులు ఉన్నారు. ఇంటి ముందర ఉన్న మురుగునీటిని దాటుకుని పోవాలంటే నానా అవస్థలు పడుతున్నాం. విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో కింద పడుతున్నారు. అధికారులు స్పందించి మా ఇబ్బందులను గమనించి మురుగునీరు ప్రవహించకుండా చూడాలి.

– రవికుమార్, స్థానికుడు, రోటరీపురం, పులివెందుల

నూతన సాంకేతికతతో అధిక దిగుబడి

వల్లూరు : రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం వలన వ్యవసాయంలో మంచి ఫలితాలను సాధించడానికి అవకాశాలు వున్నాయని భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కదిరీ వేల్ అన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని తప్పెట్ల, పెద్ద లేబాక గ్రామాలలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడడానికి అవకాశం కల్పించడంతో బాటు, ఖరీఫ్ పంట కాలంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో శాస్త్రవేత్తల బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతికతను అందించడం, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ వీరయ్య వరిలో నారు నుంచి కోత దాకా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. జీవన ఎరువుల వినియోగం, పచ్చిరొట్ట పైర్లు, సేంద్రియ ఎరువుల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కే సాయి మహేశ్వరి మినుము, నువ్వుల పంటలలో మేలైన రకాలు, విత్తన శుద్ధి, ఎరువులు యాజమాన్యం, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏవో సాయి జ్యోతి ప్రస్తుత వ్యవసాయ రంగంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ, రైతు నమోదు, కిసాన్ డ్రోన్ పథకాల గురించి తెలిపారు. పశు విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి పశుగ్రాసాల పెంపకం, పోషక యాజమాన్యం, గొర్రెలు, మేకల పెంపకం, వ్యాధులు, కోళ్లలో వ్యాక్సినేషన్ షెడ్యూల్ గురించి వివరించారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీటీ పథక నిపుణులు గిరీష్ కుమార్, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి శైలజ, పశు వైద్యులు డాక్టర్ మాధవరెడ్డి, గ్రామీణ వ్యవసాయ అధికారి నిహారిక, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీతో వేరుశనగ, కంది విత్తనాలు

లింగాల : మండల వ్యాప్తంగా 40 శాతం సబ్సిడీతో వేరుశనగ, కంది విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన తెలుపుతూ వేరుశనగ 270 క్వింటాళ్లు, కందులు 15 క్వింటాళ్లు మంజూరు కాగా.. వేరుశనగ విత్తనాలు ఒక కేజీ పూర్తి ధర రూ.93లు కాగా, అందులో సబ్సిడీ రూ.37.20లు పోనూ, రైతు వాటా ఒకేజీకి రూ.55.80లు చెల్లించాల్సి ఉంటుందని, 30 కేజీల వేరుశనగ కాయల బస్తా సబ్సిడీ పోనూ రూ.1674లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే కంది విత్తనాల పూర్తి ధర ఒక కేజీకి రూ.109.50లు కాగా, అందులో సబ్సిడీ రూ.32.85లు పోనూ, ఒక కేజీకి రూ.76.65లు కట్టాల్సి ఉంటుందని, 4 కేజీల కంది విత్తనాల ప్యాకెట్ సబ్సిడీపోనూ రూ.306,60లు చెల్లించాల్సి ఉంటున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ, కంది పంటలు సాగు చేసే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని సచివాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలుపుతూ 10వ తేదీన ఎస్‌బీఐ కాలనీ, చిన్నరంగాపురం, 11వ తేదీన రాజీవ్ కాలనీ, పెద్ద కొండప్ప కాలనీ, 12న అంకాలమ్మపేట, ప్రశాంతి నగర్, 13న కె.వెలమవారిపల్లె, భాకరాపురం, 24న వెంకటాపురం, నగరిగుట్ట, శ్రీరామ టెంపుల్, 25న గుంత బజార్, మిస్సమ్మ బంగ్లా, 26న బయమ్మ తోట, సియోన్‌పురం, 27న పెద్దరంగాపురం, ఉలిమెల్ల సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు ఉంటాయన్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన


అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ మల్లేశ్వర్‌రెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురంతోపాటు గురిజాల, హిమకుంట్ల, లోమడ తదితర గ్రామాలలో ఆదివారం వీచిన ఈదురు గాలుల దాటికి భారీగా అరటి చెట్లు నేలకొరిగాయి. సోమవారం ముద్దనూరు హెచ్ఓ మల్లేశ్వర్ రెడ్డి, ఏఓ శివమోహన్‌రెడ్డిలు దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించారు. సింహాద్రిపురంలో 18 హెక్టార్లు, హిమకుంట్లలో 14, గురిజాలలో 12 హెక్టార్లు, మొత్తమ్మీద 44 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిందన్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. అరటి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న రమణారెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమం, పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం వేంపల్లెకు చెందిన హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తండ్రి పిచ్చిరెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి మాట్లాడుతూ అనాథల పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్‌యూ ప్రతినిధులు

జమ్మలమడుగు : వృద్ధాప్యంలో, అనారోగ్యంతో మరణించిన వృద్ధులకు మేము ఉన్నామంటూ వారికి అనాథలుగా కాకుండా సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని మాడెం గుర్విరెడ్డి962) అనే వృద్ధుడు అనారోగ్యంతో మరణించాడు. ఇతనికి అంత్యక్రియలు నిర్వహించటానికి బంధువులు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో స్థానికులు పోలీసు సిబ్బందికి ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. వెంటనే మే ఐ హెల్ప్‌యూ స్పందించి సాయంత్రం ఐదు గంటలకు మృతునికి మే ఐ హెల్ప్ యూ పట్టణ అధ్యక్షుడు అహమద్ హుస్సేన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మన్ మోరె, మునీంద్ర, నక్కా గురు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

సింహాద్రిపురం : ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని హెడ్మాస్టర్ అరుణ తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం మండలంలోని అంకాలమ్మగూడూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు కామసముద్రం, అంకాలమ్మగూడూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో పిల్లలను తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల పట్ల శ్రద్ధ, సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, రాజమోహన్ రెడ్డి, మల్లేష్, ద్వారకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం


మాట్లాడుతున్న రాష్ట్ర న్యాయవాద పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బరాజు గుప్తా

పులివెందుల టౌన్ : పట్టణంలోని సరస్వతి విద్యా మందిరంలో సోమవారం రాష్ట్రీయ స్వయంసేవక్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకాన్ని స్మరించుకుంటూ ధ్వజ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజ ఆవిష్కరణ అనంతరం పట్టాభిషేక ఘట్టాన్ని ప్రతిబింబించే ప్రదర్శనలు, సంస్కృత శ్లోకాల పారాయణం, దేశభక్తి నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయవాద పరిషత్తు ఉపాధ్యక్షులు సుబ్బరాజు గుప్తా మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ ధర్మ పరిరక్షకుడిగా మాత్రమే కాదు, పరిపూర్ణ పాలకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, ధైర్యం, పరాక్రమం, హిందూ స్వాభిమానాన్ని కాపాడిన తీరుపై ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకులు, కార్యకర్తలు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


కొండాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు


పులివెందుల టౌన్ : యోగాంధ్ర ర్యాలీలో సచివాలయ సిబ్బంది, అధికారులు

కొండాపురం : యోగాతో ఒత్తిడి, ఆందోళన తగ్గించవచ్చని మండల పరిషత్ ఏవో సుబ్బయ్య తెలిపారు. సోమవారం మండలంలోని కొండాపురం సచివాలయం పరిధిలో యోగాంధ్ర డే అవగాహన కార్యక్రమంను ఐసిడిఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి ఎంఈఓ 2 రామయ్య లు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో పొందే శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించి మంచి ఆరోగ్యం పొందవచ్చాన్నారు. పిల్లలు ఎక్కువ గా సెల్ ఫోన్ వాడటం తగ్గించి ప్రతి రోజు యోగా చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాషా, అంగన్‌వాడి కార్యకర్త పద్మావతి , ఆదిలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, రాణి, తారాదేవి, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని 18 వార్డు సచివాలయాల సిబ్బంది సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా గురువు వెంకట్రామిరెడ్డి ఉచిత యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు కానీ, ప్రజలు కానీ లేకుండా కేవలం అధికారులు మాత్రమే ఈ ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీజే నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీజే పట్టణాధ్యక్షుడు ఎ.హుస్సేన్‌బాషా కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ గంగయ్యకు ఎంపీజే నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–12వ తరగతి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం వెంటనే ఇవ్వాలన్నారు. బీటెక్, ఇతర విద్యావంతులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్ గత ఏడాది, ఈ ఏడాది బకాయిలను వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మైనారిటీ స్కాలర్‌షిప్‌లను మళ్లీ పునఃప్రారంభించేలా కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే నాయకులు ముక్తియార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమం


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రోషిణి

దువ్వూరు : పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సురేష్‌బాబు, రోషిణి, హేమలత, వికసిత గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. 37 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, స్కానింగ్, థైరాయిడ్, బీపీ తదితర పరీక్షలు చేశారు. 17 మంది గర్భిణులు హై రిస్క్‌లో ఉన్నట్లు గుర్తించి, సరైన వైద్య సేవలు, సమయానికి మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు రాజగోపాల్, సువర్ణ, అప్తమాలిక్ ఆఫీసర్ చంద్రమౌళి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత జ్ఞానంపై అవగాహన

బద్వేలు అర్బన్ : ప్రతి ఒక్కరు కర్మయోగ విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి గిద్దలూరు కమిటీ అధ్యక్షులు శివకుమార్ పేర్కొన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిగురువుగా శ్రీకృష్ణుని జీవన విధానం లోకానికి ఒక ప్రామాణికమని అన్నారు. ధర్మం విలువ తెలుపుటకు, ధర్మం పక్షాన నిలబడేందుకు వయోపరిమితి అడ్డు కాదని చాటిన ధర్మశీలి శ్రీకృష్ణుడు అని అన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు లీలా నారాయణ, భాగ్యం, ఖాదర్, పుల్లమ్మ, పార్వతి, లక్ష్మీదేవి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ సునీత

వేంపల్లె : పిల్లలు శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా ఉండేందుకు 5ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ పాఠశాలలో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సునీత మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు ముఖ్యంగా శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా అంగన్వాడీ కేంద్రంలో ఆట పాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీలకు పిల్లలను పంపిస్తే పాఠశాలకు వెళ్లడానికి అలవాటు పడి 1వ తరగతిలో చేరడానికి సంసిద్ధులవుతారన్నారు. చిన్న పిల్లలను సంసిద్ధులుగా చేయడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి ఎక్కువ ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. దీంతో చిన్నపిల్లలు మానసిక ఒత్తిడికి గురై ఇబ్బంది పడాల్సి వస్తుందని, పిల్లలలో క్రమశిక్షణ, ఒకరికొకరు కలిసిపోవటం, ఆడుకోవటం, మంచి విషయాలను తెలుసుకోవడం వంటి విషయాలను అంగన్వాడీల ద్వారా పిల్లలు నేర్చుకుంటారన్నారు. పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను బోధించటమే కాకుండా పిల్లలకు పౌష్టికాహారమైన పాలు, గుడ్లు, భోజనం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్త శైలజ, అంగన్వాడీ సహాయకురాలు, మహిళలు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి


మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : పంటల సాగులో రైతులు మేలైనే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను సోమవారం ఎర్రగుంట్ల మండలంలో నిర్వహించారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన మాలెపాడు, పోట్లదుర్తి, చిన్నదండ్లూరు, చిలంకూరు, నిడుజువ్వి, చిర్రాజుపల్లె, తిప్పలూరు, ఎర్రగుంట్ల, టి.సుంకేసుల గ్రామాల్లో మేలైన విత్తనాల ఎంపిక –అధిక దిగుబడులు అనే అంశంపై చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంటల సాగుకు ముందు విత్తన శుద్ధి కూడా ముఖ్యమని తెలిపారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ మాట్లాడుతూ చిరుధాన్యాల రకాలు, ప్రాధాన్యత, పోషకాలు, వాటి సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సునీల్ కుమార్, పశువైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, మహేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకాంత్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వేంపల్లె ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ అన్నారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను ఆయన కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఆసుపత్రిలో ఉండాల్సిన ఎక్స్‌రే, గర్భిణీ స్త్రీలకు సిజేరియన్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచాలని, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, వై.రవి యాదవ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మైథిలి

కాశినాయన : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ తెలిపారు. నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోలమ్మ, ఎంపీడీఓ మైథిలి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కొంత మంది అధికారులు డుమ్మా కొడుతున్నారని, వీరిపై జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య ఆచారి, భాస్కర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఓబయ్య, పుల్లయ్య, ఎంఈఓ నిర్మల, హెచ్ఓ శ్రీనివాసులరెడ్డి, ఏఓ జయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


ఎస్టీయూ జెండా ఎగురవేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించిన చరిత్ర ఎస్టీయూ సొంతమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీయస్ కన్వీనర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయూ ^వన్‌లో సంస్థ 79 వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఉపాధ్యాయ ఉద్యమ పితామహులు వీణా విజయరామరాజు, మగ్దూం మొహియుద్దీన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ని ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రముఖ విశ్రాంత వైద్యులు మృతి


వెంకట రమణ (ఫైల్)

కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ విశ్రాంత వైద్యులు ఎం.వెంకట రమణ (67) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొద్దిరోజులుగా ఆయన డయాలసిస్ వాధితో బాధ పడుతున్నారు. సోమవారం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కమలాపురంలో 40ఏళ్ల క్రితం సొంత ఆసుపత్రి ఏర్పాటు చేసి కమలాపురం మండలంతో పాటు ఖాజీపేట, వల్లూరు మండలాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందించారు. అలాగే ప్రభుత్వ వైద్యునిగా కూడా సేవలందించారు. కమలాపురం సీహెచ్‌సీలో, పెద్దచెప్పలి సీహెచ్‌సీలో మెడకల్ ఆఫీసర్‌గా వైద్య సేవలు అందించారు. రిమ్స్‌లో ఓ విభాగంలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

బి.కోడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ ఉదయ కిరణ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పుష్పాంజలి, సూపర్‌వైజర్లు జాన్ విలియం, విజయలక్ష్మీ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏ.ఎన్.ఎం లు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన కాలువ అయిన మడూరు కాలువలో జేసీబీతో సిబ్బంది పూడికను తొలగిస్తున్నారు. శ్రీనివాసనగర్ డిపో వద్ద ఉన్న కాలువలో పూడికతీత పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. ప్రజలు ఇబ్బంది లేకుండా పూడికతీత పనులను త్వరగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ జి.వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీవిద్య జూనియర్ కళాశాలలో చదివిన ఇద్దరు విద్యార్థినులు సోమవారం కడప మాధవి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా అవార్డులు అందుకున్నారు. ఎంపీసీ విభాగంలో వి.గీతాంజలి 991/1000, బైపీసీ విభాగంలో ఎస్.సఫియా 990/1000 మార్కులు సాధించారు. ఈ విద్యార్థినులకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్, రూ.20వేలు నగదు బహుమతి అందజేశారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ రమణరావు, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్, దస్తగిరి, అధ్యాపకులు అభినందించారు.

ఒత్తిడికి గురి చేయకుండా బోధించాలి

చాపాడు : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా అధ్యాపకులు బోధించాలని చెన్నైకి చెందిన ఎస్ఐటీటీఆర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ బి.యోగమీన పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు అధ్యాపకులకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం యోగమీన మాట్లాడుతూ ఉపాధ్యాయ నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ఆధునిక సాంకేతికతను, కమ్యునికేషన్ స్కిల్స్, ఎమోషనల్ లర్నింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐటీటీఆర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మీడియా అండ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుభా తదితరులు పాల్గొన్నారు.